# అక్షరార్చన.కామ్ 10 వ తరగతి-తెలుగు మాతృభావన పాఠ్యాంశ కీలక భావన

భారతీయ సంస్కృతి స్త్రీలకు గొప్ప స్థానాన్నిచ్చి పూజించింది. పరస్త్రీలను తల్లులుగా, ఇతరుల సొమ్మును గడ్డిపరకతో సమానంగా భావించాలని చెప్పింది. ప్రస్తుత సమాజంలో స్త్రీలను పీడించి, అగౌరవపరచి, వారిపై దాడులు చేస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఇది మానవ సమాజానికి మంచిది కాదు. ఈ విపరీత ధోరణిని నివారించాలి.

అందరం స్త్రీలను విధిగా గౌరవించాలి. పెద్దలు "యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః" అన్నారు. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ పాడిపంటలకు, ఐశ్వర్యానికి లోటు ఉండదు.

భావి భారత పౌరులైన విద్యార్థులలో స్త్రీలపట్ల గౌరవాన్ని పెంపొందించడానికి "మాతృభావన" పాఠం పెట్టడం జరిగింది. అత్యున్నత వ్యక్తిత్వంగల ఆదర్శపురుషుడైన "శివాజీ" చరిత్ర ఆధారంగా ' శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రి' గారు రచించిన 'శ్రీ శివభారతము' నుండి ఈ పాఠం గ్రహించబడినది.

ఈ పాఠం నేర్చుకున్న విద్యార్థికి "స్త్రీలను గౌరవించాలి" అనే భావన దృఢంగా కలగాలి. తన ప్రవర్తన ద్వారా దీనిని వ్యక్తీకరించినపుడు ఈ పాఠ్య బోధన విజయవంతమైనట్లే. ఉపాధ్యాయుడు తన లక్ష్యాన్ని సాధించినట్లే. చారిత్రక కావ్య ప్రక్రియకు చెందిన ఈ పాఠం భారతీయ సంస్కృతికి, మత సామరస్యానికి, ఆదర్శ పాలనకు నిలువెత్తు నిదర్శనం.

ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని "అమరావతి". ప్రపంచాన్ని అబ్బురపరచిన శిల్పకళ మన అమరావతి సొత్తు. చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక నేపథ్యంగల అమరావతిని గురించి ప్రతి ఆంధ్రుడు తెలుసుకోవలసిన అవసరం ఉంది. చరిత్రలో విశేషమైన పేరు ప్రఖ్యాతులుగల నగరం అమరావతి. ఎంతోమంది చక్రవర్తులు దీనిని రాజధానిగా చేసుకొని పాలించారు. సర్వ మతాలకు నిలయమై మత సామరస్యానికి పెట్టిందిపేరు అమరావతి.

ఈ రకంగా "అమరావతి" యొక్క గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ పాఠం పెట్టడం జరిగింది. "అమరావతి" పాఠం చదివిన విద్యార్థులకు అమరావతిని చూడాలనే తపన కలగాలి. అమరావతి నిర్మాణం కోసం తన వంతు సహాయం చేయాలనే కోరిక కలగాలి. మన రాజధానియొక్క గొప్పదనాన్ని గురించి ఇంకా అధ్యయనం చేయాలి అనే తృష్ణ కలగాలి. మన రాజధాని విశ్వనగరంగా విలసిల్లాలని భావిస్తూ ఈ వ్యాసం రచయితల బృందంచే వ్రాయబడింది.

భారత దేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. దేశానికి వెన్నెముక రైతు. "గ్రామంలోని ప్రతి ఇల్లూ విద్యా గంధంతో గుబాళించి, అభివృద్ధి చెందితేనే మన దేశం సుసంపన్నంగా, సస్యశ్యామలంగా ఉంటుంది" అని మహాత్మాగాంధీ అన్నారు. కానీ సాంకేతికంగా పల్లెలు కొంత ప్రగతి సాధించినప్పటికీ పల్లె తల్లి కష్టాలు, రైతన్న నష్టాలు రోజు రోజుకి అధికమవుతున్నాయి.

ప్రస్తుతం చాలామంది ఉద్యోగాల వేటలో పడి గ్రామాలను వదిలిపెడుతున్నారు. వ్యవసాయాన్ని వదలి వ్యాపారాలవైపు వెళ్ళిపోతున్నారు. పట్టణం వెళ్ళి పెద్ద చదువులు చదవాలని ఆశించిన ఒక జానపదుడు తన బీదతనం వల్ల చదువు కొనసాగించలేక స్వగ్రామం వెళ్ళి పనుల్లో మునిగిపోయి, పట్టణంలోని శ్రీమంతుడైన తన మిత్రునికి తన పరిస్థితిని, పల్లెల దుస్థితిని తెలియజేస్తూ లేఖ వ్రాస్తాడు. ఈ అంశాలను డా॥ బోయి భీమన్నగారు 'జానపదుని జాబు' అనే పాఠ్యాంశంలో చాలా చక్కగా వివరించారు. వీరి 'జానపదుని జాబులు' అనే లేఖల సంపుటి నుండి ఈ పాఠం గ్రహింపబడింది.

మన పల్లెల పరిస్థితులు మారాలి. పదిమందికి అన్నం పెట్టే వ్యవసాయం చాలా గొప్ప వృత్తి అని, గౌరవప్రదమైనదని, రైతు సమాజానికి రారాజు అని విద్యార్థులకు తెలియజేయాలి. కష్టాలున్నప్పటికీ పల్లె జీవితంలో ఉన్న తృప్తి మరెక్కడా లేదనే భావన విద్యార్థులకు కలిగించాలి. ఈ పాఠం ద్వారా రైతులను, రైతు కూలీలను గౌరవించే స్వభావం పిల్లలకు కలగాలి.

నేడు లేఖలు వ్రాసే అలవాటు కూడా క్రమేణా కనుమరుగవుతోంది. లేఖలు వ్రాయడం కూడా 'కమ్యూనికేషన్ స్కిల్స్'లో ఒక భాగం. తమ అభిప్రాయాలను చక్కగా లేఖ రూపంలో వ్యక్తీకరించగల సామర్థ్యం విద్యార్థులకు కలిగించడం కూడా ఈ పాఠ్యాంశం పెట్టడంలోని ప్రధాన ఉద్దేశం.

ఎఱ్ఱన రచించిన "వెన్నెల" పాఠ్యభాగం కావ్య ప్రక్రియకు చెందినది. ఈ పాఠ్యాంశం 'ఎఱ్ఱన నృసింహపురాణం' నుండి గ్రహింపబడినది. హిరణ్యకశిపుడి వన విహార సందర్భములో వసంత ఋతు వర్ణన, సాయం సమయం, చంద్రోదయం, మొదలగు ప్రకృతి వర్ణన కడు రమణీయం. ఏదైనా విషయాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించడం ఒక కళ. ఏ విషయమైనా వర్ణనాత్మకంగా ఉంటే ఆసక్తిగా చదవగలం, వినగలం. చక్కటి అలంకారాలతో వర్ణిస్తూ సాగే రచనకు ఎవరైనా ఆకర్షితులౌతారు.

రక రకాల వర్ణనాంశాలను చదవడం ద్వారా వర్ణించే అలవాటు ఏర్పడుతుంది. వర్ణన వలన చెప్పే విషయానికి సౌందర్యం పెరుగుతుంది. ఏదైనా విషయాన్ని వర్ణిస్తూ మాట్లాడటం కూడా అద్భుతమైన వాగ్విన్యాసం. వర్ణనా నైపుణ్యంగల రచన అత్యుత్తమంగా నిలబడుతుంది.

విద్యార్థులకు వర్ణన అలవాటు కావాలి. ఏ అంశమైనా మంచి మంచి పదాలతో చక్కని ఊహలతో వర్ణించగలిగినప్పుడు, విద్యార్థులు తమ స్థాయికి తగిన సన్నివేశాలను వర్ణనాత్మకంగా చెప్పగలిగి, రాయగలిగినప్పుడు 'వెన్నెల' పాఠ్యబోధన సఫలమైనట్లే.!

వ్యాకరణపరంగా దోషరహితమైన భాష గ్రాంధిక భాష. విద్యార్థులకు గ్రాంధిక భాష కూడా అలవడాలి. దీని వలన ప్రాచీనకావ్యాలను సొంతంగా చదువుకొని అవగాహన చేసుకోగలరు, ఆనందించగలరు. గ్రాంధిక భాషను కూడా రుచి చూపించడానికి 'ధన్యుడు' పాఠం పెట్టడం జరిగింది. ఇది "పరవస్తు చిన్నయ సూరి" గారి రచన. ఈ పాఠ్యాంశం " నీతి చంద్రిక" లోని 'మిత్రలాభం' నుండి గ్రహింపబడినది.

ఈ రోజులలో ధన సంపాదన జీవిత ధ్యేయంగా చాలామంది బ్రతుకుతున్నారు. జీవితంలో తృప్తి, ఆనందం ప్రధానం. అంతేకాని ధన సంపాదన కాదు. ఈ విషయాన్ని విద్యార్థులు ఈ పాఠ్యాంశం ద్వారా గ్రహించగలగాలి. సజ్జన సాంగత్యం ఎప్పటికీ మంచిదనే అంశం విద్యార్థులు అవగాహన చేసుకుని ఆచరించగలగాలి. నీతి కథల సారాంశంతో ప్రేరణ పొందగలగాలి.

స్నేహితులకు మంచి మాటలు చెప్పాలి. స్నేహితుల ఆపదలను నివారించాలి. స్నేహాలను పెంపొందించుకోవాలి అనే ఉద్దేశాలు అభివృద్ధి పరచడానికి ఈ పాఠం దోహదపడుతుంది.

పిల్లలలో నైతిక విలువలను పెంపొందించడానికి ఈ పాఠం పెట్టడం జరిగింది. మేలి ముత్యాలవంటి కొన్ని శతక పద్యాలను సేకరించి, వాటిలోని భావాలను విద్యార్థులకు అవగాహన కల్పించడం, తద్వారా వారి భావి జీవితాన్ని తీర్చిదిద్దడం ఈ పాఠం ఉద్దేశం.

గుణాత్మకమైన విద్యనందించడం మన లక్ష్యం. అందుకనే విద్యార్థుల భావి జీవితం మార్గదర్శకంగా ఉండేందుకు ఉపకరించే కొంతమంది శతక కవుల పద్యాలను పాఠ్యాంశంగా ఎన్నుకోవటం జరిగింది.

లోకజ్ఞానం, భగవద్భక్తి, ధర్మం, నీతి, న్యాయం, పరోపకారం మొదలైన మంచి లక్షణాలు విద్యార్థులకు తెలియజేసి, కొన్ని శతక పద్యాలనైనా విద్యార్థులచే ధారణ చేయించగలిగితే శతక మధురిమ పాఠ్యాంశ బోధన సఫలమైనట్లే!!

ఒక పుస్తకాన్ని చదవాలనే ఆసక్తి కలిగించేది పీఠిక. గ్రంథ నేపథ్యాన్ని లక్ష్యాలను పరిచయం చేస్తూ రచయిత కాని, విమర్శకులు కాని, వ్రాసే పరిచయ వాక్యాలను పీఠిక, ముందుమాట, తొలిపలుకు అంటారు. రచయిత్రులు ఓల్గా, వసంత, కల్పన చాలా శ్రమకోర్చి 'మహిళావరణం' పుస్తకాన్ని రూపకల్పన చేసిన విధానాన్ని ' మా ప్రయత్నం' అనే పాఠ్యాంశంగా పెట్టడం జరిగింది. పుస్తకంపై అవగాహన కలిగించే పీఠికా ప్రక్రియను విద్యార్థులు తెలుసుకోవడం ఈ పాఠం ఉద్దేశం.

స్త్రీల సాధికారత, ఉద్యమాలలో, చరిత్రలో స్త్రీల నిర్మాణాత్మకమైన కృషి, పట్టుదల, అవగాహన విద్యార్థులకు కలుగజేయాలి. సమాజ నిర్మాణంలో స్త్రీల పాత్ర గురించి, స్త్రీల పోరాటాల గురించి, ఫలితాల గురించి విద్యార్థులకు పూర్తి ఉదాహరణలతో తెలియజేయాలి. స్త్రీల హక్కులు, వారి నాయకత్వంపై అచంచల విశ్వాసం విద్యార్థులలో కల్పించాలి. ఆడవాళ్ళంటే చులకన భావాన్ని తొలగించి, స్త్రీలకు సమాజపరంగా ఇవ్వాల్సిన విలువను, గౌరవాన్ని విద్యార్థులు గుర్తించి ఆచరింప చేయగలగటమే ఈ పాఠ్యాంశ ముఖ్య ఉద్దేశం.

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ఒకరైన 'అయ్యలరాజు రామభద్ర కవి' రచించిన పాఠ్యాంశం 'సముద్ర లంఘనం'. ఇది ఆయన రచించిన 'రామాభ్యుదయం' నుండి గ్రహించబడిన ప్రబంధం. శ్రీకృష్ణదేవరాయల సాహితీ భువనవిజయంలో ప్రభవించిన ప్రబంధం ఇది. సీతాన్వేషణలో వానర సైన్యం హనుమంతునికి నిర్దేశించిన ప్రధాన కర్తవ్యం, కార్యోన్ముఖుడైన హనుమంతుని రూపం,చేష్టలు, హనుమంతుని కార్యదీక్ష తెలియజేయడం, ఈ పాఠ్యాంశం యొక్క ప్రధాన ఉద్దేశం.

హనుమంతుని రూపాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించిన 'అయ్యలరాజు' గారి వలె విద్యార్థులు కూడా వర్ణన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, తమ లక్ష్యాన్ని చేరుకోవాడానికి కఠోర పరిశ్రమ, అంకిత భావం అలవరచుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించడమే పాఠ్యాంశ ఉద్దేశం.

వచన కవితా ప్రక్రియను పరిచయం చేసి వచన కవితా రచనను ప్రోత్సహించడం కూడా ఈ ప్రక్రియ ఎన్నుకోవడంలోని ప్రధాన ఉద్దేశం. 'మాణిక్యవీణ' పాఠ్యభాగాన్ని 'విద్వాన్ విశ్వం' గారు రచించారు.చిన్న చిన్న పదాలు, వాక్యాలతో ధ్వని గర్భితంగా ఉండే ఈ కవిత విశ్వం గారి కవితా సంపుటి లోనిది.

వాస్తవ దృష్టితో పరిశీలించడం, మూఢ నమ్మకాలను విడిచిపెట్టడం, కేవలం కృషి, పట్టుదల, దీక్షలతో మాత్రమే ప్రగతి సాధ్యమని విద్యార్థులు తెలుసుకునేలా చేయడం పాఠ్యాంశ ప్రధానాంశం. సాంకేతిక, విజ్ఞాన ప్రగతితోపాటు కళలు కూడా మన జీవితంలో ఒక భాగమని, ఆటవిక దశనుండి ఆధునిక దశ వరకు మనిషి ప్రయాణంలోని సన్నివేశాలను తెలియజేస్తూ కళ, కవిత్వం, విజ్ఞానం, మానవాళికి దిశా నిర్దేశం చేసి మానవుణ్ణి శాశ్వతుణ్ణి చేస్తాయని విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రగతితోపాటు మానవత్వం, సచ్ఛీలత, నైతికత్వం కూడా మానవాళి అందరికీ అవసరమని, తప్పక ఆచరించాలని బోధించగలిగితే మన ప్రయత్నం సఫలమైనట్లే..!

మానవ సంబంధాలు, సామాజిక సేవ ఇతివృత్తంతో పాత్రల మనోభావాలను కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించిన 'పులికంటి కృష్ణారెడ్డి' గారి చక్కని కథానిక " గోరంత దీపాలు". ఇది పులికంటి వారి 'కథావాహిని' నుండి గ్రహింపబడినది.

సమాజంలో ఎంతోమంది అనాథ బాలలు కనీస అవసరాలైన తిండి, బట్ట, చదువు మొదలైన వాటికి నోచుకోకుండా, పెద్దల ప్రేమకు దూరంగా, సమాజానికి భారంగా పెరుగుతుంటారు. అటువంటివారిని మనమెవరమైనా చేరదీసి విద్యాబుద్ధులు నేర్పగలిగితే వీరు కూడా మట్టిలో మాణిక్యాలలా వెలుగొందుతారు.

మానవ సంబంధాలు బలహీనమైన నేటి రోజుల్లో పక్కవాడి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. తన సుఖం, తన సంపాదన అనే ఆలోచన ఎక్కువైంది. స్వార్థం పెరిగిపోయింది. ఇది మంచి పోకడ కాదు.

దీనిని మార్చాలి. పరస్పరం సహాయం చేసుకోవాలి. ఇతరులకు సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం, సంతృప్తి ఉన్నాయి. మహాత్ములకు ప్రపంచమంతా ఒకటే కుటుంబం. "ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకమ్" అని పెద్దలన్నారు. రైలు ప్రయాణంలో తటస్థపడిన ఓ అనాథ బాలుణ్ణి ఒక గొప్ప వ్యక్తి చేరదీసి విద్యాబుద్ధులు చెప్పిస్తే, ఆ వ్యక్తి చూపే కృతజ్ఞతాభావం, వాళ్ళ మధ్య ఉండే మానవ సంబంధాలను తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

అక్షరార్చన.కామ్

# భిక్ష పాఠ్యాంశ కీలక భావన

‘భిక్ష’ పాఠ్యభాగం కావ్య ప్రక్రియకు చెందింది. ఇది కవిసార్వభౌముడు ‘శ్రీనాథుడు’ రచించిన ‘కాశీఖండము’ లోనిది. మానవులకు ఉండకూడని అవలక్షణాలలో కోపం ఒకటి. కోపం వలన గౌరవం తగ్గుతుంది. ఉనికిని కోల్పోతాము. అనవసరంగా కష్టాలపాలవుతాము.

మహర్షులను కూడా పతనం చేయగల కోపం యొక్క లక్షణాన్ని వేదవ్యాసుని పాత్ర ద్వారా విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలి. వేద విభజన చేసి, పంచమ వేదంగా పేరుగాంచిన మహాభారతాన్ని రచించి, అష్టాదశ (18) పురాణాలను రచించి, పదివేల శిష్యులతో మహా పవిత్రమైన కాశీ పట్టణంలో కొలువుండి అనునిత్యం ధర్మాచరణ గావించి భిక్షాటనంతోజీవనం కొనసాగిస్తూ అందరిచే గౌరవింప బడుతున్న వ్యాసుడు లాంటి మహర్షి కూడా తనకు ఒకరోజు భిక్ష లభించలేదనే నెపంతో కాశీ పట్టణాన్ని శపించబోతాడు. అంత గొప్ప మహర్షి కూడాకోపానికి లోనై చివరకి కాశీ పట్టణాన్ని వదిలివేయవలసివస్తుంది.

మహర్షులను కూడా పతనం చేయగల కోపం మంచి లక్షణం కాదని విద్యార్థులు ఈ పాఠం ద్వారా తెలుసుకోగలగాలి. విద్యార్థులలో విచక్షణ పెరగాలి. అనవసరమైన కోపం తగ్గాలి. ఇతరులను తూలనాడే స్వభావం పోయి మంచి విద్యార్థులుగా మెలగాలనే సదాశయంతో ఈ పాఠం పెట్టడం జరిగింది.

'చిత్రగ్రీవం' అను పాఠ్యభాగం కథా ప్రక్రియకు చెందింది. 'ధనగోపాల్ ముఖర్జీ' రచించిన 'చిత్రగ్రీవం- ఓ పావురం కథ' అనే పుస్తకం నుంచి గ్రహించబడింది.

మనమందరం జంతువులను, పక్షులను, మానవులను, మొక్కలను అన్నిటినీ పరిశీలించాలి. బాగ పరిశీలించి అవగాహన చేసుకోవాలి. శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి. జీవితంలోని ప్రతి మార్పును ఆనందంగా అనుభవించాలి. ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ప్రకృతిని, జీవులను ప్రేమించాలి. పెంచాలి. ఆదరించాలి. పోషించాలి. జాగ్రత్తగా అనునయించాలి.

'చిత్రగ్రీవం' పిల్లల ఆనందంకోసం పెట్టిన పాఠ్యాంశమే అయినా దీనికి ప్రకృతి పరిశీలకులను కూడా అలరించే శక్తి ఉంది. పావురాల జీవనానికి సంబంధించిన అతి సూక్ష్మ వివరాలు తెలియ జెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

అక్షరార్చన.కామ్